డ్రగ్స్‌తో భవిష్యత్ నాశనం

- తల్లిదండ్రులు పిల్లలను గమనించాలి
- మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమంలో పోలీసులు
- పలుచోట్ల ర్యాలీల నిర్వహణ



మణుగూరుటౌన్: పట్టణంలో విద్యార్థుల చేత మానవహారం ఏర్పాటు చేసిన పోలీసులు



పినపాక: విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎస్సై రాజ్ కుమార్

మణుగూరుటౌన్: మాదక ద్రవ్యాల వినియోగంతో భవిష్యత్ నాశనమవుతుందని, నివారణకు సమిష్టిగా కృషి చేయాలని మణుగూరు సీఐ సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొందరు అవగాహన లోపంతో మాదకద్రవ్యాలను వినియోగిస్తూ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటూ తల్లిదండ్రుల ఆశలను గల్లంతుచేస్తున్నారన్నారు. మాదకద్రవ్యాలు తయారు చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మేడ ప్రసాద్, రంజిత్, పోలీసు సిబ్బంది, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: మాదక ద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. మండల కేంద్రం, దమ్మపేట ప్రధాన సెంటర్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా పోలీస్ డిపార్ట్‌మెంట్ పనిచేస్తుందని, దీనికి ప్రజల సహకారం కూడా అవసరమని అన్నారు. డ్రగ్స్ రవాణా, వినియోగంపై సమాచారం ఉంటే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో దమ్మపేట జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఊషారాణి, అదనపు ఎస్సై బాలస్వామి, కానిస్టేబుళ్లు నాగముత్యం, రాజులు, నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పినపాక: మాదకద్రవ్యాలను అరికట్టడంలో యువత బాధ్యత వహించాలని, మాదక ద్రవ్యాలను నిర్మూలించి భావితరాలకు డ్రగ్స్ రహిత సమాజాన్ని అందించాలని ఈ.బయ్యారం ఎస్‌ఐ రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఎక్స్‌లెంట్ పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. యువత మత్తు పదార్థాలను అరికట్టడంలో ముందుండి తమకు పూర్తి సమాచారాలను అందించాలని, తద్వారా వాటిని నిర్మూలించేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కరకగూడెం ఎస్సై రాజేందర్, ఎక్స్‌లెంట్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు సౌకర్యాలు కల్పించాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జారే, తదితరులు

దమ్మపేట: ధాన్యం అమ్మకానికి కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులకు, తగిన సౌకర్యాలను కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని నాచారం గ్రామంలో కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ఎమ్మెల్యే జారే చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ గ్రేడ్ వరి ధాన్యానికి రూ.2,320లు, సాధారణ ధాన్యానికి రూ.2,300లుగా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. ఈ సీజన్ నుండి సన్న రకం వరి ధాన్యానికి ప్రభుత్వం అదనంగా రూ.500ల బోనస్‌ను కూడా ఇవ్వనుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మద్దిశెట్టి సత్యప్రసాద్, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, రావు గంగాధరరావు, కొయ్యల అచ్యుతరావు, సొసైటీ వైస్ చైర్మన్ కట్టం ఎర్రప్ప, సొసైటీ డైరెక్టర్లు, మండల కాంగ్రెస్ నాయకులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫేర్ ఏర్పాట్లు పరిశీలన

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): సైన్స్‌ఫేర్ నిర్వహణ పగడ్బందీగా నిర్వహించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధికారులకు సూచించారు. ఈ నెల 18 నుండి మూడు రోజులపాటు జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలో బుధవారం ఎమ్మెల్యే గురుకులం పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఎగ్జిబిట్స్ ప్రదర్శించే గదులు, భోజన కౌంటర్లను, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా చూడాలని, ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎంఈఓ ఆనంద్‌కుమార్, ఎస్‌ఐ చంద్రశేఖర్ నాయకులు పర్సా వెంకట్,వనమా గాంధీ, వేముల రమణ, ఎస్‌కె.హమీద్, నాగరాజు, వీరబోయిన నాగేశ్వరరావు, దుబాకుల రాము, దస్తగిర్ ఉన్నారు.

పార్టీ పురోభివృద్ధికి కృషిచేయాలి



సభలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

భద్రాచలంఅర్బన్: భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు అయిన సందర్భంగా ఆ ఉత్సాహంతో నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పార్టీ పురోభివృద్ధికి సైనికుల్లా పనిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా అన్నారు. బుధవారం భద్రాచలం పట్టణంలోని పార్టీ డివిజన్ కార్యాలయంలో డివిజన్ స్థాయి సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యుడు అడ్డగర్ల తాతాజీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1925 వ సంవత్సరంలో పేదలు బడుగు బలహీన వర్గాలు, కార్మికులు, కర్షకుల కోసం సీపీఐ ఆవిర్భవించిందన్నారు. వందేళ్లవుతున్న సందర్భంగా వాడవాడలా సీపీఐ జెండాలు రెపరెపలాడాలని, పార్టీ పోరాటాన్ని, త్యాగాన్ని ప్రజలకు వివరించాలని పాషా సూచించారు. అదే విధంగా భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ భద్రాచలం డివిజన్ కార్యదర్శిగా కల్లూరు వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన డివిజన్ స్థాయి సమావేశంలో ఈ ఎన్నిక చోటు చేసుకుంది. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య, రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరు వెంకటేశ్వరరావు, ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నారాటి ప్రసాద్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

బూర్గంపాడు: మండల పరిధిలోని తాళ్ల గొమ్మూరుకు చెందిన ఓ విద్యార్థిని అదృశ్యమైనట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఓ ప్రవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఆ విద్యార్థినిని.. ఆమె తండ్రి మంగళవారం ఉదయం పాఠశాల వద్ద దింపి వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో విద్యార్థిని పాఠశాలకు హాజరు కాలేదని సదరు పాఠశాల ఉపాధ్యాయులు తల్లితండ్రులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబసభ్యులు విద్యార్థిని కోసం గాలించినప్పటికీ ఫలితం రాలేదు. మంగళవారం రాత్రి విద్యార్థిని తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని జగ్గారం క్రాస్ రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన జాన్‌బీ, చిట్టిబాబు నడుకుంటూ వెళ్తుండగా మణుగూరు వైపు వెళ్తున్న ఆటో వేగంగా ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన ఇద్దరిని మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మునగసాగుపై దృష్టి సారించాలి

అశ్వాపురం: రైతులు మునగసాగుపై దృష్టి సారించాలని డీఆర్‌డీఓ విద్యాచందన అన్నారు. మండల పరిధిలోని నెల్లిపాక గ్రామంలో బుధవారం మునగసాగు చేస్తున్న రైతులతో ఆమె మాట్లాడారు. అశ్వాపురంలో రైతువేదికలో మునగసాగుపై రైతులు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. మునగసాగు చేయాలన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సీతారాం నగర్ కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలను బుధవారం మండల విద్యాధికారిణి టి.రమ సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థుల హాజరుతో పాటు ఉపాధ్యాయులు పిల్లలకు బోధిస్తున్న తీరును ఆమె పరిశీలించి పలు సూచనలు తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అందిస్తున్న చేతిరాత నోటుబుక్కులను విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా విద్యాబోధన సకాలంలో పూర్తి చేయాలని, పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.రామకృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మాట వింటేనే విజయం

దుమ్ముగూడెం: తల్లిదండ్రులు, అధ్యాపకుల మాటకి విలువనిచ్చిన వారు జీవితంలో విజయం సాధిస్తారని భద్రాచలం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, టీజీఓ జిల్లా అధ్యక్షుడు సంగెం వెంకటపుల్లయ్య విద్యార్థులకు తెలిపారు. బుధవారం దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా టీజీఓ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికై నందుకు కళాశాల తరుపున సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ వేముల కామేశ్వర రావు, కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.కృష్ణవేణి, కళాశాల అధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడాపోటీలు ప్రారంభం

మణుగూరురూరల్: భగవాన్ బిర్సాముండా జయంతిని పురస్కరించుకుని వనవాసీ కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు మణుగూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్న వాలీబాల్ క్రీడాపోటీలను బుధవారం డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ప్రశాంతత కలుగుతుందని, శరీరం దృఢంగా మారుతుందని, స్నేహభావం పెంపొందుతుందని తెలిపారు. మణుగూరు సబ్ డివిజన్ వ్యాప్తంగా జరుగుతున్న ఈ వాలీబాల్ పోటీలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, వనవాసీ కల్యాణ పరిషత్ సభ్యులు కుంజా నర్సింహరావు, రామారావు, రామకృష్ణ, మధుసూధన్, బిక్షపతి, ఆంజనేయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

బూర్గంపాడు: ఒంటరి మహిళలకు చేయూతగా ఐటీసీ బంధన్ సంస్థ నిర్వహిస్తున్న పలు సేవాకార్యక్రమాలు అభినందనీయంమని ఏపీఎం యం. నాగార్జున పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం మండల కేంద్రంలో ఆ సంస్థ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ.. నిరుపేద మహిళా ఆధారిత కుటుంబాలకు కూరగాయల బండి, పండ్ల బండి, కుట్టు మిషన్లు, బట్టల షాప్, ఫ్యాన్సీ దుకాణాలను ఉచితంగా సంస్థ వారు ఏర్పాటుచేసి ఇవ్వడం గొప్పవిషయమని ప్రశంసించారు. అంతేకాకుండా లబ్ధిదారులు ఏ విధంగా వ్యాపారాల్లో రాణిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. బంధన్ వారు ఇచ్చిన వ్యాపారాలను సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలన్నారు. పోస్టల్ శాఖ సిబ్బంది ఆనంద్ రావు, ఐటీసీ బంధన్ సంస్థ ఏరియా కోర్డినేటర్ ఉత్తమ్ మారజిత్, టీల్ ఉమ్మల సుమన్ రెడీ, సీఓ భూక్యా కుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ తెగల షెడ్యూల్ కులాల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను బుధవారం పలు సమస్యలపై జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ లకావత్ వెంకటేశ్వర్లు సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలశారు. సమస్యలను వివరించి వినతి పత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా ఐటీడీఏ పరిధిలో ఖాళీగా ఉన్న ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులను గిరిజన ప్రాంత నిరుద్యోగులతో భర్తీ చేయాలని ఏజెన్సీ ప్రాంతంలో ఖనిజ సంపాదన ఇసుక రీచులను గిరిజన సొసైటీల ద్వారా జీవనోపాధిగా కల్పించాలని ఈ సందర్భంగా ఆయనను కోరారు. సానుకూలంగా స్పందించిన వెంకటయ్య సమస్యల పరిష్కారానికి జిల్లా ఉన్నతాధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

వితరణ..

అశ్వారావుపేటరూరల్: ఆసుపాక గ్రామానికి చెందిన పింగుల రాము పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమవగా.. ఆ కుటుంబానికి స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం 50 కేజీల బియ్యం, వంటసామగ్రి, దుస్తువులు, దుప్పట్లు, కూరగాయాలు వితరణగా అందించారు. ఏపీలోని కొయ్యలగూడేనికి చెందిన ఎల్ఎస్ఎం సంస్థ డైరెక్టర్ దేవా సహాయం, జక్కుల రాంబాబు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసరాలతోపాటు ఆర్థిక సాయాన్ని అందజేశారు. నాయకులు నల్లపు రామారావు, ఉప్పల ప్రసాద్, లోకం సాంబశివ రావు, ముస్తఫా, బైయ్య సత్యనారాయణ, ఉప్పల మురళి, ఎల్ఎస్ఎం సంస్థ బాధ్యులు ప్రేమ కుమారి, థామస్, మధు, సామ్యూల్, సువర్త రాజు, క్రిష్, రాజేష్ పాల్గొన్నారు.

కోటన్న మరణం తీరని లోటు



కోటన్న భౌతిక కాయంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పిస్తున్న నాయకులు

గుండాల: న్యూడెమోక్రసీ మాజీ అజ్ఞాత దళ కమాండర్ దేవళ్లగూడెం గ్రామ కమిటీ సభ్యుడు ఈసం పాపారావు అలియాస్ కోటన్న మరణం విప్లవ ఉద్యమానికి తీరని లోటని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, జిల్లా నాయకులు కొమరం సీతారాములు, ఆదివాసి ట్రైబల్ ఫోరం జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం అన్నారు. బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందిన కోటన్న భౌతిక కాయంపై బుధవారం దేవళ్ళగూడెంలో పార్టీ శ్రేణులు ఎర్ర జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో వారు మాట్లాడుతూ.. న్యూడెమోక్రసీ అజ్ఞాత దళంలో కోటన్న 10 సంవత్సరాల పాటు పనిచేసి దళ కమాండర్ వరకు ఎదిగాడని అన్నారు. కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి అరేం నరేష్, జిల్లా నాయకులు యాకన్న, పర్శక రవి, యాసారపు వెంకన్న, గడ్డం లాలయ్య, ఈసం మంగన్న, పెండేకట్ల పెంటన్న, పూనెం పొట్టయ్య, పాయం ఎల్లన్న, బుక్య వెంకన్న, బానోతు లాలు, ఎస్‌కె.అజ్గర్, మోకాళ్ల ప్రసాద్, వాగబోయిన బుచ్చయ్య, ఎట్టి గాదెయ్య, పూణే మల్లేష్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

దుమ్ముగూడెం: భక్తుల కొంగు బంగారంగా కొలిచే దుమ్ముగూడెం గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారి నిధుల దుర్వినియోగంపై గ్రామస్తులు సీఐ అశోక్ కుమార్, తహసీల్దార్ అశోక్‌కుమార్‌లకు బుధవారం ఫిర్యాదు చేశారు. గత మూడు సంవత్సరాల క్రితం ఎన్నికయిన ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బైరెడ్డి సతీష్‌లు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రతి రెండేళ్లకోసారి అంగరంగవైభవంగా జరిగే అమ్మవారి జాతరకు భక్తుల నుంచి సుమారు రూ.60 లక్షల ఆదాయం వస్తుందని, జాతర ముగిసిన మూడు నెలల తర్వాత గ్రామస్తుల సమక్షంలో గ్రామసభ నిర్వహించి జమాఖర్చులు తెలపాల్సి ఉందని అన్నారు. కానీ అందుకు విరుద్ధంగా ప్రస్తుత పాలక కమిటీ గ్రామసభ పెట్టకుండా జమా ఖర్చులు చెప్పకుండా కుంటిసాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. అమ్మవారికి చెందిన రూ.50 లక్షల విలువ గల బంగారం, వెండి నగలు అనవాయితీగా నూతన కమిటీకి అప్పగించాల్సి ఉందని, కానీ ఇంత వరకు స్టీరింగ్ కమిటీకి కానీ, నూతన కమిటీకి కానీ అప్పగించకపోవడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ ఆలయ కమిటీ చైర్మన్ అల్లాడి భాస్కరరావు, కర్రి శివకుమార్, కెల్లా శేఖర్, బైరెడ్డి జయవెంకటరమణ, గడ్డం బాలాజీ, ప్రసాద్, సాగర్, రాజేష్ ఉన్నారు.

సైకిళ్లు పంపిణీ



బూర్గంపాడు: పంపిణీ చేసిన సైకిళ్ల వద్ద ట్రస్ట్ చైర్మన్, సభ్యులు

బూర్గంపాడు: మండల పరిధిలోని ఇరవెండి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం తాళ్లూరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు, తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్నీలిమ దంపతుల సౌజన్యంతో 12 సైకిళ్లను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమశ్రీకి ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య అందజేశారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా సైకిల్లు అందించినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వల్లూరిపల్లి వంశీకృష్ణ, ట్రస్ట్ సభ్యులు విజయ రేణుక, జగన్మోహన్, వనమా రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌నర్సుల నియామకం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఏడుగురు హెడ్‌నర్సులు బుధవారం విధుల్లో చేరారు. వీరంతా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహించి భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. కాగా ఇప్పటికే ఏరియా ఆస్పత్రిలో ఒక హెడ్ నర్సు విధులు నిర్వహిస్తుండగా, కొత్తగా చేరిన వారితో కలిపి మొత్తం 8 మంది హెడ్‌నర్సులు భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నారు.

ఇద్దరు అరెస్ట్..

చంద్రుగొండ : పోడు భూముల వివాదంలో భార్యాభర్తలపై దాడికి పాల్పడిన ఇద్దరు నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ గంజి స్వప్న తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం .. ఈ నెల 2న దుబ్బతండాలో పోడు భూ వివాదంలో బాణోత్ బాలు, లక్ష్మి దంపతులపై భూక్యా భీముడు, అతడి కుమారుడు సురేష్‌లు మారణాయుధాలతో దాడి చేసి గాయపర్చారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.

జీపీ వర్కర్ల రాస్తారోకో



ములకలపల్లి ప్రధాన సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న జీపీ వర్కర్లు

ములకలపల్లి: విద్యుత్ ఘాతంలో మృతి చెందిన జీపీ కార్మికుడు బాణోతు తరుణ్ కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎండీ.యూసఫ్, సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ములకలపల్లి ప్రధాన సెంటర్లో రాస్తారోకో చేసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. జీపీ వర్కర్స్ జేఏసీ నాయకులు గంటా శ్రీనివాసరావు, చిక్కుల శ్రీను, ఒగ్గెల దారయ్య, మేకల రమేశ్, కనకం చిన్నయ్య, ఏసుబాబు, బత్తుల సంజీవరావు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భద్రాచలంఅర్బన్: గోదావరి ఒడ్డున బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్య మైంది. టౌన్ ఎస్‌ఐ పీవీఎన్ రావు కథనం ప్రకారం.. స్థానికుల సమాచారంతో గోదావరి నదిలో సుమారు 50 ఏళ్ల వయసు ఉన్న ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. చామనఛాయ రంగులో ఉండి, నలుపు రంగు జుట్టు, పసుపు రంగుపై నిలువు గీతలు ఉన్న చొక్కా, గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. అతని వద్ద ఓ లగేజీ బ్యాగ్ కూడా ఉంది. మృతదేహాన్ని భద్రాచలం ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచారు. ఎవరైనా గుర్తిస్తే భద్రాచలం స్థానిక పోలీస్ స్టేషన్‌లో, 87126 82106, 87126 82108 నంబర్లలో సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక సాయం

మణుగూరురూరల్: మండల పరిధిలోని తిర్లాపురం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన తూముల రాజ్‌కుమార్ ఇటీవల మరణించాడు. నాయిబ్రాహ్మణ కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న రాజ్‌కుమార్ మరణించడంతో ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న తిర్లాపురం గ్రామ మున్నూరుకాపు సంఘం సభ్యులు రూ.7,500లను కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనం



ఉపకార వేతనాలు అందజేస్తున్న రామచంద్రప్రభు

చర్ల: దేశ భక్తిని నింపుకొని దేశం కోసం పాటు పడే వారిని తీర్చిదిద్దడమే ధ్యేయంగా పని చేస్తున్నామని తులసీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ తులసీ రామచంద్రప్రభు అన్నారు. చర్లలో స్థానిక ప్రతిస్పందన ఎడ్యుకేషనల్ సొసైటీ, గుంటూరుకు చెందిన శ్రీ కృష్ణ దేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ ప్రెవిలైజ్డ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి స్పందన ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఎస్‌కె.షాజాహాన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 200 మంది నిరుపేద విద్యార్థులకు రూ.8 లక్షలను ఉపకార వేతనాలుగా అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తులసీ రామచంద్రప్రభు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థీ రక్షణ రంగం వైపు అడుగులు వేయాలని ఆయన ఆకాక్షించారు. ఇప్పటి వరకు తాము రూ.25 కోట్లను పేద విద్యార్థులకు ఉపకార వేతనాల కింద అందజేసినట్లు తెలిపారు. రామచంద్రప్రభు సతీమణి అరుణ, రవాణాశాఖ అధికారి సంగం వెంకట పుల్లయ్య, చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కామేశ్వరావు, పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వరలక్ష్మి, ప్రముఖ సామాజిక వేత్తలు జవ్వాది రాంబాబు, రౌతు నర్సింహారావు చింతూరు వెంకట్రావు ప్రతిస్పందన ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు చింతా నాగబాబు, ఎడారి భూపతి, పున్నం రామకృష్ణ, నీలి ప్రసాద్, దొడ్డి తాతారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాగ్రత్తలు తప్పనిసరి



బూర్గంపాడు: పశు వైద్య శిబిరంలో వైద్యాధికారి, సిబ్బంది

బూర్గంపాడు: పాడి పశువుల పెంపకంలో పాడి రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని మండల పరిధిలోని మొరంపల్లి బంజర పశువైద్యశాల వైద్యాధికారి రాజేందర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ముసలమడుగు గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం వైద్యాధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు 40 గేదెలను తీసుకురాగా వాటిని పరీక్షించి మందులు ఇచ్చారు. అలాగే 30 దూడలకు నట్టల మందు తాగించారు.అనంతరం పశుగ్రాసాల ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. గోపాలమిత్రులు టి.గోవిందరెడ్డి, సీహెచ్ కిరణ్, కె.నాగేశ్వరరావు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మిడ్ డే మీల్స్ ఏర్పాటు అభినందనీయం

మణుగూరుటౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పరీక్షలు ముగిసే వరకు మధ్యాహ్న భోజన వసతి ఏర్పాటుకు లయన్స్ క్లబ్ కృషి చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మణుగూరు జూనియర్ కళాశాలలో మిడ్ డే మీల్స్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం కోట్లాది రూపాయలు వెచ్చించి విద్యా వ్యవస్థ పటిష్టం కోసం అనేక చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్యప్రకాశ్, మండల కాంగ్రెస్ నాయకులు పీరినాకి నవీన్, మండల నాయకులు పాల్గొన్నారు.

మల్లీశ్వరికి నివాళి..

మున్సిపాలిటీలోని విఠల్‌రావు నగర్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ దేశబోయిన మల్లీశ్వరి ఇటీవల అనారోగ్యంతో మరణించగా.. బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

సేవా గ్రంథాల పంపిణీ

అశ్వారావుపేటరూరల్: డీఎస్సీ–24 ద్వారా నూతనంగా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఉచితంగా సేవా గ్రంథాలను అందించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం పి.హరిత చేతుల మీదుగా ఆయా సేవా గ్రాంథం పుస్తకాలను ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. ఉద్యోగులకు సేవా గ్రంథాలు ఎంతో ఉపయోగకరమని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శులు నరసింహారావు, కేఆర్‌సీ ప్రసాద్, మండల బాధ్యులు బొర్రా సత్యనారాయణ, రమాదేవి, పుల్లయ్య, లక్ష్మయ్య, చలపతిరావు, సీఆర్పీ ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులోని మానవ సేవ వాలంటరీ ఆర్గనైజేషన్ వృద్ధాశ్రమానికి పులకండం సత్యనారాయణ మూర్తి వారి శ్రీమతి పుట్టిరోజు సందర్భంగా బుధవారం వితరణ అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమానికి 50 దుపట్లు, 50 కిలోల బియ్యాన్ని నిర్వాకురాలు సరోజమ్మ, రఫీకి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ భాను ప్రసాద్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, కొమ్మగిరి వెంకటేశ్వర్లు, అలవాల రాజా పాల్గొన్నారు.

అడ్‌హక్ కమిటీ ఎన్నిక

మణుగూరురూరల్: బీసీ ఐక్యవేదిక మండల కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘ పెద్దలు డాక్టర్ దుస్సా సమ్మయ్య, వలసాల వెంకటరామారావు, జి.వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. బీసీలంతా ఐక్యమై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బీసీ హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి నిర్వహించే ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం బీసీ ఐక్యవేదిక మండల నూతన అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నారు. అడ్‌హక్ కమిటి కన్వీనర్‌గా వీరంకి వెంకట్రావుగౌడ్, కోకన్వీనర్లుగా శ్రీరాముల పెద్దులు, నాగారపు సతీష్‌లతో పాటు 20మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో బీసీ ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్యశిబిరం

కరకగూడెం: మండల పరిధిలోని చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలలో బుధవారం కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కారం మధు ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులను పరీక్షించి పలువురికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో హెచ్ఈఓ పోలెబోయిన కృష్ణయ్య, హెచ్‌ఏ కృష్ణ, హెచ్ఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.